క్లుప్తంగా

వీర్ల అంకమ్మ తల్లికి ఎమ్మెల్సీ జంగా పూజలు



దాచేపల్లి: శ్రీ వీర్ల అంకమ్మ తల్లి కొలుపుల తిరునాళ్ల బుధవారం కన్నుల పండువలా జరిగింది. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచారు భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానాన్ని ఎమ్మెల్సీ జంగా ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, కర్పూరపు వెంకటకోటయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 7,8 వార్డుల్లో అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ వద్ద ప్రజలు, వాహనదారులు సాగిచేందుకు ఇబ్బందికరంగా ఉంది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే డ్రైనేజీతో పాటు సిమెంట్ రోడ్డు కూడా నిర్మించాలని చైర్మన్ కొప్పుల సుబ్బమ్మకు ఆయన సూచించారు. దీంతో జేసీబీతో ఆక్రమణలు తొలగించి సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. పనుల్ని మార్కెట్ యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు, వార్డు ఇన్‌చార్జి కనమర్లపూడి గోపి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనూష పర్యవేక్షిస్తున్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించండి



వెల్దుర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెల్దుర్తిలో బుధవారం ఉపాధి హామీ పనుల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే రూ. 272 వస్తుందని కూలీలకు చెప్పారు. మండలంలో అన్ని పంచాయతీల్లో ఉన్న ఆరు వేల మంది కూలీలకు పని కల్పించాలని సిబ్బందికి చెప్పారు. వేసవిలో పని దినాలను పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, టీఏ ఈశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ రమణానాయక్, మేట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు



జయపాల్‌ను సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ధూళిపాళ్ల గ్రామానికి చెందిన చిలుకా జయపాల్ బుధవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జయపాల్‌ను అభినందిస్తూ మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆశీర్వదించారు. దళిత సామాజిక వర్గాల నాయకుల్ని కలుపు కొని పార్టీకి మేలు జరిగేలా చూడాలని చెప్పారు. జయపాల్ మాట్లాడుతూ సమష్టి కృషితో పార్టీ కార్యక్రమాల్ని బలోపేతం చేసేందుకు, ఎస్సీల్ని చైతన్యం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం జయపాల్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ అచ్యుత శివప్రసాద్, ధూళిపాళ్ల ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివన్నారాయణ, నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల, పట్టణ, రూరల్ మండ లాల జేసీఎస్ ఇన్‌చార్జులు మేడం ప్రవీణ్‌రెడ్డి, పులిబండ్ల అశోక్, బొంత వెంకటరెడ్డి, కొణతం స్వాతి, నాయకులు వల్లెం నరసింహారావు, రేపూడి రవితేజ, తలతల భాస్కర రెడ్డి, భట్లూరు కోటేశ్వరరావు, పలు గ్రామాల దళిత నాయకులు పాల్గొన్నారు.

'వరికపూడిసెల' నిర్మాణంలో పీఆర్కే కృషి ప్రశంసనీయం

కలెక్టర్ లోతేటి శివశంకర్



ప్రభుత్వ విప్ పీఆర్కే, కలెక్టర్ శివశంకర్, కుర్రి సాయిమార్కొండారెడ్డికి గజమాలతో సత్కారం

మాచర్ల: పల్నాటి రైతుల కలను నిజం చేసే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించి కేంద్ర ప్రభుత్వ అనుమతులు ఇప్పించి వరికపూడిసెల ప్రాజెక్టును చేపట్టే విధంగా కృషి చేసిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కొనియాడారు. పట్టణంలోని పీఎల్ఆర్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ప్రభుత్వ విప్ పీఆర్కే, జిల్లా కలెక్టర్ శివశంకర్, వరికపూడిసెల కోసం గతంలో ఉద్యమం చేసిన కుర్రి సాయిమార్కొండారెడ్డిని రైతులు, అధికారులు ఘనంగా గజమాలతో సత్కరించారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు అనుతులు తేవడంలో పీఆర్కే విశేష కృషి జరపగా, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఢిల్లీలో మంత్రులు, అధికారులతో చర్చించి అనుమతులు ఇప్పించారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తాను కలెక్టర్‌గా ఉన్న సమయంలో ప్రారంభించే అవకాశం రావడం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకొని పరిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ మంచి మనసున్న మనిషని ప్రభుత్వ విప్ పీఆర్కే కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌ను ఆయనతో పాటు జిల్లా వ్యవసాయాధికారులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళి, ఏడీఏ జగదీష్‌రెడ్డి, ఏవోలు లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, బ్రహ్మారెడ్డి, యలమందారెడ్డి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి త్వరలో శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

వెల్దుర్తి: పల్నాటి రైతుల చిరకాల వాంఛ అయిన వరికపూడిసెల ఎత్తిపోతల నిర్మాణ పథకానికి త్వరలో సీఎం జగన్‌మోహనరెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తెలిపారు. మండలంలోని వజ్రాలపాడు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బుధవారం రామావత్ పద్మాబాలునాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన రమావత్ బోజీబాయి హనుమంతునాయక్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటంతో ఉప సర్పంచ్‌గా ఉన్న రామావత్ పద్మాబాలు నాయక్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. పెద్ద మనుషుల ఒప్పందంలో భాగంగా పదవికి దీర్ఘకాలిక సెలవు పెట్టిన బోజీబాయిని ఆయన అభినందించారు. నూతనంగా ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన పద్మాబాలునాయక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వరికపూడిసెల పథకానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పీఆర్కేలు ఎప్పటికప్పుడు స్పందించి పథకం నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1996లో ఈ పథకానికి ఎటువంటి అనుమతులు లేకుండానే శంకుస్థాపన చేసి పల్నాడు రైతులను మోసం చేశారని ఆరోపించారు. 2018లో ఇదే పథకానికి రూ 341 కోట్లతో టెండర్‌ను పిలిచి మరోసారి రైతుల్ని దగా చేశారని తెలిపారు. పథకానికి పైపు లైన్, డ్రైజర్ హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణానికి 19 హెక్టార్ల భూమి అవసరం కాగా దుర్గి మండలం ఓబులేసునిపల్లె వద్ద 54 ఎకరాల రెవెన్యూ భూమిని అటవీ శాఖాధికారులకు బదిలీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేయించి, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రూప్లీ బాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, శిరిగిరిపాడు సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, శిరిగిరిపాడు–2 ఎంపీటీసీ సభ్యురాలు బోడిబాయి, వైఎస్సార్ సీపీ నాయకులు రామావత్ బాలునాయక్, ఇస్లావత్ చిన హనుమానాయక్, రామావత్ హనుమంతునాయక్, ఈవోపీఆర్డీ జవహర్ లాల్ నెహ్రూ, పంచాయతీ కార్యదర్శి మాచర్లయ్య పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

కమిషన్ చైర్మన్ బత్తుల పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

గురజాల : బాలల హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కమిషన్ చైర్మన్ బత్తుల పద్మావతి సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం మిషన్ వాత్సల్య – స్పాన్సర్‌షిప్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అనాథలు, అభాగ్యులైన చిన్నారులకు ఆర్థిక చేయూతనందించేందుకు 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనందిస్తూ మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. గతంలో హెచ్ఐవీ బారిన పడిన చిన్నారులకు మాత్రమే అందించేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు తల్లిదండ్రులు కోల్పోయి ఆదరణ లేకుండా ఉన్న చిన్నారులకు ఈ పథకం ద్వారా నెలకు రూ. 4వేలు అందించనున్నట్లు చెప్పారు. తల్లి లేదా తండ్రి ఒక్కరూ కోల్పోయినా ఈ పథకానికి అర్హులన్నారు. అర్హత కలిగిన వారికి ఈ పథకం వర్తించాలనే లక్ష్యంతో దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు చిన్నారులకు కావాల్సిన సర్టిఫికెట్లను రెవెన్యూ అధికారులు ఆలస్యం చేయకుండా అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కె. అద్దెయ్య, డీఎల్‌డీవో గబ్రూనాయక్, సీడీపీవోలు, తహసీల్దార్లు, సీడీపీవోలు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంపీడీవోలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం పనితీరు భేష్

కారెంపూడి: రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో గ్రామ సచివాలయాలు చురుకైన పాత్ర పోషిస్తున్నాయని కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. ఆమె బుధవారం సాయంత్రం కారెంపూడి గ్రామ సచివాలయం –2ను తనిఖీ చేశారు. బాలలకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును ఆమె సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 'మిషన్ వాత్సల్య' పథకం ద్వారా ఆర్థిక చేయూతను అనాథలైన 18 ఏళ్లలోపు పిల్లలందరికీ అందించాలనే లక్ష్యంతో సేవా భావంతో పనిచేయాలని సంబంధిత శాఖల సిబ్బందికి సూచించారు. ఇప్పటికి ఈ పథకం కింద పల్నాడు జిల్లాలో 4,426 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అనంతరం ఆమె పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో పల్నాటి వీరుల గుడిని సందర్శించారు. పల్నాటి వీరుల ఆయుధాలను దర్శించుకున్నారు. ఆయుధాలకు పూజలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారిణులు ఉన్నారు.

పరాశక్తి సేవలు అభినందనీయం



పాలువాయి జంక్షన్(రెంటచింతల): ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు సత్రశాల పరాశక్తి సిమెంటు ప్యాక్టరీ యాజమాన్యం పాలువాయి జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ కట్టెకోట పుల్లారావు అన్నారు. చలివేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వీఆర్వో పల్లా రామకృష్ణ, సిమెంటు ప్యాక్టరీ ప్రతినిధి కేసర వేణుగోపాలరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు, వైఎస్సార్ సీపీ నాయకుడు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



మాచర్ల: పట్టణంలోని నారాయణ స్కూలులో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజీఎం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. యూకేజీ పూర్తి చేసుకొని గ్రేడ్– 1లోకి వెళుతున్న విద్యార్థుల్ని అభినందించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ విద్యార్థులంతా అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. కృష్ణవేణి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా చక్కగా చదువుకుని ఉన్నతస్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి, పాఠశాల ఇన్‌చార్జులు ఆంజనేయులు, సైదారావు, ఉదయలక్ష్మి, సునీత, శివకిరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గి పీఏసీఎస్ అధ్యక్షుడిగా కటకం రామారావు



ప్రభుత్వ విప్ పీఆర్కేను మర్యాదపూర్వకంగా కలసిన రామారావు, నాయకులు

దుర్గి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా దుర్గికి చెందిన కటకం రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు బుధవారం ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి సహకరించిన పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని బుధవారం వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు పంట రుణాలు సకాలంలో అందే విధంగా కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కటకం గోపాల్, పార్టీ నాయకులు కటకం వెంకటయ్య, కటకం సత్యం, గోపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న చంద్రబాబు



మాట్లాడుతున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి వయోభారంతో మతిభ్రమించి ఇష్టానుసారంగా మాట్లాతున్నారని బెల్లంకొండ ఎంపీపీ చెన్నుపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. మంగళవారం అమరావతి మండలంలో చంద్రబాబు పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై చేసిన వ్యాఖ్యల్ని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాయకులతో కలసి ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం మరిచి, ధనార్జనే ధ్యేయంగా రాష్ట్రంలో చంద్రబాబు పాలన సాగించారని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనతో పేద ప్రజలకు భరోసా కల్పిస్తూ పాలన చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజల్లో ఉంటూ ఒక్క రూపాయి అవినీతికి పాల్పడకుండా, మచ్చలేని ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక తవ్వకాలలో అక్రమాలు చేస్తూ కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దొంగే... దొంగ దొంగ అన్నట్లు ఉన్నాయని తెలిపారు. తెలుగుదేశంలో హయాంలో ఏ విధంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేశారో నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. వారి అక్రమ తవ్వకాలకు నదిలో పడి చనిపోయిన 28 మంది చిన్నారులే సాక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించి ఇసుక తవ్వకాలను చేపడుతుంటే, స్థానిక ఎమ్మెల్యే ఇసుక తవ్వకాల ద్వారా నెలకు రూ.20 కోట్లు సంపాదిస్తున్నారని అనడం హాస్యాస్పదంగా ఉందని ఖండించారు. బెల్లంకొండ మండలంలో చంద్రాజుపాలెం, కందిపాడు, మాచాయపాలెం గ్రామాల్లో జగనన్న కాలనీల కోసం 50 ఎకరాలలో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వానికి ఇచ్చి కోట్ల రూపాయలు ఆర్జించారని చంద్రబాబుతో అబద్ధాలు చెప్పించడం సిగ్గు చేటని తెలిపారు. ఈ మూడు గ్రామాలతో పాటుగా మండలంలోని ఏ గ్రామంలో ఇంతవరకూ ఒక్క సెంటు కూడా భూసేకరణ జరగలేదని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గత పదేళ్లలో మాజీ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి కార్యక్రమాల్ని ఈ నాలుగేళ్లలో ఎమ్మెల్యే శంకరరావు చేసి చూపించారని వివరించారు. అబద్ధపు మాటలతో ప్రజల్ని మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబు, టీడీపీ నాయకులకు ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, బూటకపు ప్రేలాపల్ని మానుకోకపోతే చూస్తే ఊరుకునేది లేదని మండల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, తురకా ఏడుకొండలు, కో–ఆప్షన్ మెంబర్ దరియా, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి శ్రీను, గాదె మిల్లు వెంకటరెడ్డి, సర్పంచులు నరసింహానాయక్, రమణారెడ్డి, శేషిరెడ్డి, సైదయ్య, లక్ష్మీనారాయణ, బ్రహ్మం, వెంకటస్వామి, శేషిరెడ్డి, కంభంపాటి పాప, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, మర్రి శ్రీనివాసరెడ్డి, నాయకులు మేకల వెంకటేశ్వర్లు, బడా బచ్చ, సుబ్బయ్య పాల్గొన్నారు.


పాల పళ్ల విజేత నార్నెపాడు ఎడ్ల జత



ఎడ్ల బల ప్రదర్శన

దాచేపల్లి : స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. పాలపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం నార్నెపాడుకు చెందిన మోపర్తి ఆరియన్స్ చౌదరి ఎడ్ల జత 4523 అడుగుల దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన కన్నెధార రామ్‌తేజ చౌదరి ఎడ్ల జత 4391 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెద పరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్ల జత, పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమేట్లకు చెందిన వెలిదండి బాబు ఎడ్ల జత 4250 అడుగుల దూరం లాగి మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గొల్లవిడిపికి చెందిన వి. శ్రీనివాసరెడ్డి ఎడ్లజత 4126 అడుగుల దూరం బండను లాగి ఐదో స్థానంలో, వైఎస్సార్ కడప జిల్లా కలసపాడు మండలం నల్లగుండపల్లెకు చెందిన వల్లూరి రవికుమార్‌రెడ్డి ఎడ్ల జత 4వేల అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20వేలను వట్టె యలమంద, రూ.15వేలను యర్రంశెట్టి గోపీనాథ్, రూ.10వేలను మంచాల వెంకటేశ్వర్లు, రూ.7వేలను గుండ్రెడ్డి కొండలరావు, శ్రీను, రూ.5వేలను మొగతాల సైదారావు, నాగేశ్వరరావు, రూ. 5వేలను యలమల నాగయ్య అందించారు. నగదుతో పాటు విజేతలకు షీల్డ్సను కూడా అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలీప్ తదితరులు పర్యవేక్షించారు.

పంచాయతీల్లో డీపీఓ తనిఖీలు



డీపీఓ భాస్కరరెడ్డి

కారెంపూడి: కారెంపూడి, పేటసన్నెగండ్ల గ్రామ పంచాయతీలను బుధవారం పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి తనిఖీ చేశారు. పేటసన్నెగండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఆస్తి పన్ను విధింపు విషయంలో అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఎల్. శివశంకర్ ఆదేశాల మేరకు తొలుత ఆయన కార్యాలయంలో రికార్డుల్ని తనిఖీ చేశారు. అనంతరం కారెంపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంటి పన్నుల వసూళ్ల తీరును ఆయన పరిశీలించారు. ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లాలోనే కారెంపూడి గ్రామ పంచాయతీ ముందంజలో ఉందని గుర్తించి పంచాయతీ కార్యదర్శి కాసిన్యానాయక్, జూనియర్ అసిస్టెంట్ పి. వెంకటేశ్వర్లు, సిబ్బందిని అభినందించారు. పంచాయతీలో సిబ్బంది కొరత ఉందని గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాబాయితేజానాయక్ డీపీఓ దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బంది కొరతను అధిగమించడానికి పంచాయతీ ప్రతిపాదనలు పంపితే వాటిని ఆమోదిస్తామని చెప్పారు. తమ కాలనీలో 550 ఇళ్లు ఉన్నాయని, వాటికి ఇంటి పన్ను విధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదినారాయణ కాలనీవాసులు డీపీఓను కోరారు. ప్రభుత్వం త్వరలో అమలులోకి తీసుకు రానున్న సుమిత్వా పథకం ద్వారా ఆస్తి పన్నుల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ పథకంపై ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలకు 29న కలెక్టర్ అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రజల ఆస్తులకు భద్రత కలుగుతుందని, వాటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయని తెలుస్తోందని చెప్పారు. ప్రతి ఇంటికీ అసిస్మెంట్ నంబరు, ఆస్తిపై హక్కుతో పాటు గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ప్రమీలాబాయి తేజానాయక్, ఈఓఆర్డీ పి. సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అంబేడ్కర్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



లావణ్య



గాయత్రీదేవి

విజయపురిసౌత్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 82 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బి. లావణ్య 950, జి. గాయత్రీదేవి 937 మార్కులు, బైపీసీలో బి. నక్షత్ర 949, వై. వెంకటేశ్వరమ్మ 939 మార్కులు సాధించినట్లు చెప్పారు.

మోడల్ స్కూలు విద్యార్థినుల సత్తా



ప్రియాంక



మైత్రి

కారెంపూడి: ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో మోడల్ స్కూలు విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపారు. బైపీసీలో బచ్చు ప్రియాంక 948 మార్కులు, ఎంపీసీలో బత్తుల మైత్రి 946 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బి. కుసుమ 409 మార్కులు సాధించింది. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ వనపాల్‌రెడ్డి తెలిపారు. సెకెండ్ ఇయర్ విద్యార్థులు 52 శాతం ఉత్తీర్ణులయ్యారని ఆయన పేర్కొన్నారు.

జీకే సంస్థల విద్యార్థుల విజయభేరి



ఐశ్వర్య

మాచవరం: మండలంలోని జీకే విద్యా సంస్థలకు చెందిన శ్రీవిజేత జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో గొల్లపల్లి ఐశ్వర్య 984, మంగా రాజ్యలక్ష్మి 975, పూసల దీప్తిక 964 మార్కులు సాధించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపింది.

నేడు వేలం పాట

దాచేపల్లి : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నామని సీఐ షేక్ బిలాలుద్దీన్ తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

మజ్లిసుల్ ఉలమా పల్నాడు కమిటీ ఎన్నిక



కమిటీ ఏర్పాటుకు సమావేశంలో పాల్గొన్న ముస్లింలు

రెంటచింతల: మజ్లిసుల్ ఉలమా పల్నాడు కమిటీ నూతన అధ్యక్షుడిగా మాచర్ల పట్టణానికి చెందిన ముఫ్తి అబ్దుల్ రషీద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గుంటూరు జిల్లా అధ్యక్షుడు ముఫ్తి అబ్దుల్ బాసిత్ తెలిపారు. స్థానిక రైల్‌పేటలోని జామియా మార్కస్ మజీద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాచర్ల, గురజాల నియోజకవర్గాల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా గురజాలకు చెందిన యూనుస్, కోశాధికారిగా రెంటచింతలకు చెందిన మహమ్మద్ షఫీ, ఉపాధ్యక్షులుగా పిడుగురాళ్లకు చెందిన ముఫ్తి మహమ్మద్, మాచవరానికి చెందిన హఫీజ్ అలీ, దాచేపల్లికి చెందిన ముఫ్తి యూసఫ్, కారంపూడికి చెందిన మౌలానా ఖలీల్, కార్యదర్శులుగా అబ్దుల్ రహమాన్, మౌలానా మహమ్మద్, షరీఫ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కార్య నిర్వహణ చేపడుతుందని చెప్పారు. ముఫ్తి అసిఫ్, ముఫ్తి ముజాహిత్, రహమతుల్లా, హాఫీజ్ అబ్దుల్ ఖాదర్, ప్రభుత్వ ఖాజీ ముహమ్మద్ రిజ్వాన్ జామియా మార్కస్ కమిటీ చైర్మన్ తండా సైదా, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.